బీఆర్‌టీయూను బలపరచాలి: ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

మేడ్చల్: మేడ్చల్ పారిశ్రామికవాడలోని రాణే ఇంజిన్ వాల్స్ కంపెనీలో గుర్తింపు యూనియన్‌గా ఉండి తిరిగి ఎన్నికలలో పోటీ చేస్తున్న బీఆర్‌టీయూను ఆ కంపెనీ కార్మికులు మరోసారి బలపరచాలని ఆ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. కంపెనీ కార్మికులతో తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై ఎప్పటికప్పుడు పరిష్కారం చూపుతూ నిత్యం వారి వెంట ఉన్న బీఆర్‌టీయూను గెలిపించాలని కోరారు. ఈ నెల 20న నిర్వహించే ఎన్నికలలో బీఆర్‌టీయూ ప్యానల్‌కు ఓటు వేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు విఠల్, నర్సింహాచారి, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కీసరలో అంబేడ్కర్‌కు జ్ఞానమాల



జ్ఞానమాల కార్యక్రమంలో పాల్గొన్న చీర్యాల మాజీ సర్పంచ్ పులగుర్ల లావణ్య

కీసర: అంబేడ్కర్ సంఘం కీసర మండల శాఖ ఆధ్వర్యంలో జ్ఞానమాల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చీర్యాల గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ పులగుర్ల లావణ్య శ్రీనివాస్ పాల్గొని, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో అంబేడ్కర్ మహోన్నతమైన వ్యక్తి అని ప్రశంసించారు. మేడ్చల్ జిల్లా వైస్ చైర్మన్ బెస్త వెంకటేశ్, కీసర రామాలయ చైర్మన్ నాయకపు వెంకటేశ్, అంబేడ్కర్ సంఘ అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను నిత్యం స్మరించుకోవాలి



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న సుధాకర్, అరుణ్‌కుమార్

ఘట్‌కేసర్: ఎస్టీ, ఎస్సీ, బీసీలకు రాజ్యాంగం ద్వారా హక్కులు ప్రసాదించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను నిత్యం స్మరించుకోవాలని అంబేడ్కర్ జూనియర్ సంఘం అధ్యక్షుడు సుధాకర్ అన్నారు. అంబేడ్కర్ ఆలోచనావిధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ బాధ్యుడు మీసాల అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం వల్లే ప్రపంచం భారత్ వైపు చూస్తోందన్నారు. శ్రీనివాస్, కృష్ణ, శ్రీరామ్, భాస్కర్, నర్సింగ్‌రావు, సత్యం, శ్రీశైలం, మహేశ్, గణేశ్‌గౌడ్, జగదీశ్, కృష్ణంరాజు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభోత్సవంలో కార్పొరేటర్

బోడుప్పల్: విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేశ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ మల్లయ్యనగర్ కాలనీలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్యలు లేకుండా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ వైర్లు, త్రీ ఫేస్ కరెంట్ వంటి సమస్యలు లేకుండా చేస్తామన్నారు. తమ డివిజన్ పరిధిలో ఏమైన విద్యుత్ సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సంతోష్, రామాంజనేయులు, అంజల్‌రెడ్డి, నాగభూషణం, శేఖర్‌రెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

గల్లీలు జల్లెడ పట్టి.. వీధి కుక్కలను తరలించి



దుండిగల్: వీధి కుక్కల దాడి ఘటనలు వెలుగు చూసిన నేపథ్యంలో ఆదివారం దుండిగల్ మున్సిపల్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డీపోచంపల్లి వార్డు నం.10లోని శ్రీకృష్ణనగర్‌కాలనీలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు ఆధ్వర్యంలో బ్లూక్రాస్ సొసైటీ, వెటర్నరి సిబ్బంది పలు గల్లీల్లో కుక్కల కోసం జల్లెడ పట్టారు. వాటిని పట్టుకుని యానిమల్ కంట్రోల్ బర్త్ వ్యాన్‌లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించేందుకు తరలించారు. ఈ సందర్భంగా కమిషనర్ సత్యనారాయణరావు మాట్లాడుతూ... కుక్కల బెడద తీవ్రంగా ఉంటే 9948795555, 9542715377 నెంబర్లలో సంప్రదించాలన్నారు. బ్లూక్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కుక్కను తరలించి కరవకుండా ట్రీట్‌మెంట్ చేస్తారని పేర్కొన్నారు.

కిడ్స్ సమ్మర్ క్యాంప్.. 4కే రన్





హైదరాబాద్ రన్నర్స్ అవుట్‌డోర్ కిడ్స్ సమ్మర్ క్యాంప్ గ్రాడ్యుయేషన్ సెర్మనీని హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం దూలపల్లిలోని తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ వద్ద ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ గంగారెడ్డి, హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ ప్రెసిడెంట్ అభిజిత్ మద్నూకర్‌లు ముఖ్య అతిథులుగా హాజరై 4కే రన్‌ను ప్రారంభించారు. ఈ రన్‌లో నగరంలోని పలు పాఠశాలలకు చెందిన 1100 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పిల్లలు ఆరోగ్యకరంగా పెరిగేందుకు దోహదపడే వాతావరణాన్ని పెంపొందించడానికి ఈ రన్‌ను నిర్వహించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. - కుత్బుల్లాపూర్

విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటాం

- గత అనుభవాల దృష్ట్యా సిబ్బంది సిద్ధం
- ఉప్పల్‌కు ముంపు సమస్య లేదు :సర్కిల్ ఈఈ నాగేందర్



ఉప్పల్ సర్కిల్‌లో సిద్ధమైన మాన్‌సూన్ టీం

ఉప్పల్: వర్షాకాల సీజన్‌లో ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి జీహెచ్‌ఎంసి ఉప్పల్ సర్కిల్ మాన్‌సూన్ సిబ్బంది సిద్ధమయ్యారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి సమస్యలు తలెత్తినా ఎదుర్కొనేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారు. నైరుతి రుతుపవనాలు ముందే పలకరించడంతో అధికారులు అలర్ట్ అయ్యారు. హైదరాబాద్‌కు భారీ వర్ష సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో ఇప్పటికే జీహెచ్‌ఎంసి కమిషనర్, మేయర్ ఆయా సర్కిళ్లకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చెప్పారు. దీంతో ఉప్పల్ సర్కిల్ అధికారులు అప్రమత్తమయ్యారు. జూన్ ఒకటవ తేదీ నుంచి మాన్‌సూన్ సిబ్బందిని రంగంలో దించారు. ప్రతి వార్డుకు ఒక టీం చొప్పున సర్కిల్ పరిధిలోని నాలుగు వార్డులకు నాలుగు టీంల చొప్పున కేటాయించారు. ప్రతి టీంలో నలుగురి బృందం సర్కిల్ కార్యాలయంలో నిరంతరం అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు. దాదాపుగా రూ. 65 లక్షల అంచనా వ్యయంతో అక్టోబర్ చివరి వరకు ఈ టీం కొనసాగనుంది. అత్యవసర సమయాల్లో అనుకోని సంఘటనలు చోటు చేసుకుంటే మరిన్నీ టీంలు కూడా అందుబాటులోకి వచ్చే విధంగా చర్యలు చేపట్టారు. భారీ వర్షాలు ఉండటంతో ప్రజలు, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్యవసర సమయాల్లో 040-21111111,9001136675కు ఫోన్ చేసి ఫిర్యాదులను చెప్పాలని అధికారులు సూచిస్తున్నారు.

ఉప్పల్‌లో ముంపు సమస్య లేదు

గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందే అప్రమత్తం చేశాం. ఉప్పల్ సర్కిల్ పరిధిలో ముంపు బెడద లేకుండా కల్వర్టులపై బారి వంతెనలను నిర్మించాం. దీంతో దాదాపుగా 20 కాలనీల ప్రజలకు ముంపు సమస్య తప్పింది. నాలాల్లో సాఫీగా వరద నీరు వెళ్లడానికి ఇప్పటికే పూడికలు తీసి ఏలాంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకున్నాం. ఎలాంటి సమస్య వచ్చినా మేము సిద్ధంగా ఉన్నాం.

–ఈఈ నాగేందర్

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: రాజబోల్లారం సబ్ స్టేషన్ పరిధిలోని వెంకటేశ్వర గుట్ట ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్‌లో చెట్లకొమ్మల నరికివేత కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. రాజబోల్లారం గ్రామంతో పాటు గ్రామ పరిధిలోని పలు పరిశ్రమలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్‌-1 పరీక్షలు

మేడ్చల్ రూరల్: ప్రభుత్వం ఆదివారం నిర్వహించిన గ్రూప్‌–1 పరీక్ష మేడ్చల్‌లో ప్రశాంతంగా ముగిశాయి. కండ్లకోయలోని సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో 5 సెంటర్లు, గౌవెళ్లిలోని హితం కళాశాలలో ఒక సెంటర్‌లో మొత్తం 5,640 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. పరీక్ష సందర్భంగా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

గంజాయి విక్రేత అరెస్ట్

మేడ్చల్‌రూరల్: గంజాయి విక్రయిస్తున వ్యక్తిని మేడ్చల్ ఎస్‌వోటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మేడ్చల్ మండలం పూడూరు గ్రామంలో నివాసం ఉంటున్న సర్కార్ రూపేశ్(25) గత కొంతకాలంగా గజాయిని విక్రయిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో రావల్‌కోల్ చౌరస్తా సమీపంలో ఓ వ్యక్తికి గంజాయి విక్రయించేందుకు వేచి ఉండగా పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచ 180 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పూడూరులోని అతని నివాసంలో తనిఖీ చేసి మేడ్చల్ పోలీసులకు నిందితుడిని అప్పగించారు.

యువకుడు ఆత్మహత్య



మేడ్చల్ రూరల్: ఓ వ్యవసాయ క్షేత్రంలో పని చేస్తున్న వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బీహార్ రాష్ట్రానికి చెందిన సికేంద్రకుమార్(21), అతడి తమ్ముడు సునీల్‌కుమార్ 5 నెలల క్రితం వలస వచ్చి శామీర్‌పేట మండలం యాడారంలోని ఓ వ్యవసాయక్షేత్రంలో పనిచేస్తూ అక్కడే నివస్తున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో సికేంద్రసింగ్ తన తల్లితో ఫోన్‌లో గొడవ పడుతూ మాట్లాడాడు. మరునాడు తెల్లవారుజామున వ్యవసాయక్షేత్రంలో గల చింతచెట్టుకు ఉరేసుకున్నట్లు గుర్తించి మేడ్చల్ పోలీసులు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సోదరిపై కర్రతో దాడి



తలకు తీవ్ర గాయంతో వాణి

ఉప్పల్: సోదరుడు సోదరికి మధ్య జరిగిన గొడవలో ఆవేశానికి లోనైన సోదరుడు కర్రతో దాడి చేయగా ఆమె తలకు తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. చిలుకానగర్‌లో ఓ ప్రైవేట్ స్కూల్ యజమాని శివ శంకర్ ఇటీవల ఆయన తల్లి రమాదేవిని ఇంటి నుంచి గెంటివేయడంతో అధికారుల స్పందించి తిరిగి ఆమెను సొంత ఇంటికి క్షేమంగా చేర్చారు. ఈ క్రమంలోనే ఆదివారం తిరిగి శివ శంకర్ తన తల్లి ఉంటున్న చిలుకానగర్‌కు వచ్చి సోదరి వాణి (42), వృద్ధురాలైన తల్లితో గొడవకు దిగాడు. ఈ నేపథ్యంలో మాటామాట పెరగటంతో ఆవేశానికి లోనైన శివశంకర్ సోదరి వాణిపై కర్రతో దాడి చేయడంతో ఆమె తలకు తీవ్ర గాయం అయింది. వెంటనే ఆమెను స్థానికులు, బంధువులు చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని దాడికి పాల్పడిన శివ శంకర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉచిత హెల్త్ క్యాంపు



ఉచిత హెల్త్ క్యాంపును ప్రారంభిస్తున్న సంఘం అధ్యక్షుడు అన్నోజు కృష్ణ చారి

మేడిపల్లి: ఉరుకులు, పరుగుల నగర ప్రజల జీవితంలో తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్న తరుణంలో ఉచిత హెల్త్ క్యాంపులు నిర్వహించడం వల్ల ప్రజల ఆరోగ్య రక్షణకు ఎంతగానో దోహదపడుతుందని మేడ్చల్ జిల్లా విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు అన్నోజు కృష్ణ చారి అన్నారు. ఆదివారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం జిల్లా కార్యాలయంలో సంఘం లేబర్ కార్డు ఉన్న సభ్యుల కోసం సీఎస్‌సీ హెల్త్ కేర్ సహకారంతో అధ్యక్షుడు అన్నోజు కృష్ణచారి ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు రెండు రోజులపాటు నిర్వహిస్తామన్నారు. సందర్భంగా ఆయన మా ట్లాడుతూ లేబర్ కార్డున్న ప్రతి ఒక్కరికి ఉచిత పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సమస్యలను తెలుసుకొని మందులు, అవసరమైన వైద్య సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని కార్డున్న ప్రతి సభ్యుడు సద్వినియోగ పరుచుకోవాలన్నారు. ఈ హెల్త్ క్యాంపులో అధిక సంఖ్యలో హాజరైన వారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌సీ హెల్త్ కేర్ సభ్యులు సుజాత, కిరణ్, సంఘం ఉపాధ్యక్షుడు వడ్ల యాదయ్య, మామిడి యాదగిరి చారి, అన్నోజు మదన్ చారి, బన్నాల శ్రీనివాస్ చారి, తొడోజు సోమచారి, దోంతోజు సత్యనారాయణ, ప్రసన్న పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో కొర్రెముల్ పాఠశాల పూర్వ విద్యార్థులు

ఘట్‌కేసర్: కొర్రెముల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998–99 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం స్థానిక చెరుకు బాలయ్య గార్డెన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. చాలా ఏళ్ల తర్వాత కలిసిన బాల్యమిత్రులు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని సంతోషం వ్యక్తం చేశారు. పదో తరగతి తర్వాత విద్యా, ఉద్యోగాల కారణంగా ఒకరినొకరు దూరమైన స్నేహితులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూలమాలలు, శాలువాలతో సత్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

కీసర: కీసర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1998–99 బ్యాచ్ పదో తరగతికి చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం కీసరలోని నల్ల వెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులంతా ఒక్కచోట చేరి చిన్ననాటి తీపి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అనంతరం అప్పటి గురువులను ఘనంగా సత్కరించారు.



కీసర పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

నిజాంపేట్: రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. ఆదివారం బాచుపల్లిలోని పార్టీ కార్యాలయంలో నిజాంపేట్ కార్పొరేషన్ 126 డివిజన్ శివనగర్ కాలనీ గణేష్ సంక్షేమ సంఘం సభ్యులు హన్మంతరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానికంగా పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు కమిటీ హాలు, విద్యుత్ స్తంభాలను త్వరితగతిన ఏర్పాటు చేసేలా చూడాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ సాంబశివరావు, ఉపాధ్యక్షుడు సంతోష్ రెడ్డి, జనరల్ సెక్రటరీ రామకృష్ణ, జాయింట్ సెక్రటరీ జావీద్, కోశాధికారి నాగరాజు, ఆర్గనైసింగ్ సెక్రటరీ మాధవ్‌రావు, నాయకులు రత్నేశ్వర్‌రావు, జామన్ బాషా, శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం



చింతల్: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో నెలకొన్న సమస్యలపై ఆదివారం డివిజన్ నాయకులు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. భగత్‌సింగ్‌నగర్ కాలనీలోని పలు గల్లీల్లోని అంతర్గత రోడ్లను పూర్తి చేయాలని, కమ్యూనిటీ హాలు వెనుక ప్రాంతంలో ఉన్న కాలువలో పూడిక తీత చేపట్టాలని, అదే విధంగా మట్టి కుప్పలను తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు సాగుతున్నామని అన్నారు. స్థానిక సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నాయకులు బిసు వెంకటేశం గౌడ్, కుడికెల సహదేవ్, చిప్ప రమేష్, కుడికల నాగరాజ్, సతీష్ వెంకటస్వామి, సదల రమేష్, కిషన్‌గౌడ్ అనిల్, శేఖర్‌గౌడ్, జగదీష్‌గౌడ్, బాలరాజ్‌గౌడ్ ఉన్నారు.

ప్రశాంతంగా గ్రూపు -1 పరీక్షలు

కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో గ్రూప్–1 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలోని 69,727 మంది అభ్యర్థుల కోసం 105 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలకు 48,962 మంది అభ్యర్థులు హాజరు కాగా, 20,765 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో పలు గ్రూప్–1 పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ గౌతమ్ పరిశీలించారు. కూకట్‌పల్లిలోని ఎంఎన్‌ఆర్ డిగ్రీ అండ్ పీజీ కాలేజీ, ప్రతిభ డిగ్రీ కాలేజీ , బాలానగర్ మార్టిన్ హైస్కూల్‌లో గ్రూప్–1 పరీక్ష కేంద్రాలను ఆదివారం సంబంధిత అధికారులతో కలిసి సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. అలాగే, ఉప్పల్, మేడిపల్లిలోని ఒమేగా డిగ్రీ కాలేజీ, మేఘ ఉమెన్స్ డిగ్రీ అండ్ జూనియర్ కాలేజీ, స్ఫూర్తి ఉమెన్స్ డిగ్రీ కాలేజీ, శ్రీ మేధా డిగ్రీ కాలేజీల్లోని గ్రూప్ –1 పరీక్ష కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సందర్శించారు.



ఎదులాబాద్ పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు, సిబ్బంది

ఘట్‌కేసర్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఘట్‌కేసర్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూం నుంచి పరీక్ష పేపర్లు పంపిణీ చేసి తిరిగి పరీక్ష పూర్తి కాగానే పీఎస్‌కు తరలించారు. ఈ ప్రక్రియను ఏసీపీ విజయ్‌కుమార్ పర్యవేక్షించారు. స్ట్రాంగ్ రూం పరిధిలోని 16 కేంద్రాల్లో 12,326 మంది అభ్యర్థులను కేటాయించగా 8,750 మంది హాజరయ్యారు. 3,576 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. స్థానిక సీఐ సైదులు ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

బీజేపీ సంబరాలు



కీసరలో నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నేతలు

కీసర: నరేంద్రమోదీ వరుసగా మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా కీసర మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి కోల బాల్‌రాజ్ యాదవ్, సీనియర్ నేత వంగేటి బాపిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రమైన కీసరలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నేత సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, బోడ శ్రీనివాస్‌రావు, మెట్టు కృష్ణాయాదవ్, శ్రీశైలం, చినింగని సుధాకర్, నల్ల వెంకట్‌రెడ్డి, మహేందర్‌యాదవ్, బర్లపాటి అంజనేయులు, శ్రీధర్, పొట్ట ఆంజనేయులు, నాగరాజు, పవన్, కోల మల్లేష్‌యాదవ్, బండారి శ్రీనివాస్‌రెడ్డి, రావుల ముత్యం తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో పాల్గొన్న బీజేపీ నాయకుడు రాహుల్ రెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి సుచిత్ర కాలనీలో శ్రీకర రాఘవేంద్ర హాస్పిటల్ ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ముఖ్యఅతిథిగా భారతీయ జనతా పార్టీ యువజన నాయకుడు కొంకట్ల రాహుల్ రెడ్డి పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య సేవలు నిర్వహించిన హాస్పిటల్ యాజమాన్యం అభినందనీయమన్నారు.

నేడు పీర్జాదిగూడలో ప్రజావాణి

మేడిపల్లి: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు, మేయర్ జక్కు వెంకట్ రెడ్డిలు వేర్వేరు ప్రకటనలో వెల్లడించారు. ప్రతి సోమవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు నిర్వహించే ప్రజావాణి అవకాశాన్ని ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా ప్రజావాణిలో అందజేసి సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

ఘనంగా శ్రీవారి కల్యాణం

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానంలో శ్రీవారి కల్యాణం ఆదివారం ఘనంగా జరిగింది. కల్యాణ మహోత్సవాన్ని ప్రధాన అర్చకులు ముడుంబై వెంకట రమణాచార్యులు, అర్చకులు తులసి రమణాచార్యులు, వేణుగోపాలాచార్యులు నిర్వహించారు. ప్రతి నెలా రెండో ఆదివారం కల్యాణం నిర్వహిస్తున్నామని ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

ఉప్పల్ : ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పేరణి శ్రీనివాస్ శిష్యబృందంచే నిర్వహించిన ఆంధ్రా నాట్యం నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. వినాయక కౌతం, గంగాధర, ఆగణిత, నిన్ను మంచిన, సరస్వతి, దశావతారాలు, తిల్లాన, నవగ్రహాలు, ప్రవేశ దరువు తదితర అంశాలను ఆక్షయ చర్య, నందిత, హారిక రెడ్డి, అధ్వయ, చతుర్వి, మనస్విని, వర్ష, శ్రీనిధి, అధితి దాస్ తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

మల్లాపూర్: సీసీ రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని నాచా రం కార్పొరేటర్ శాంతి సాయిజెనేఖర్ అన్నారు. ఆదివారం నాచారం రాఘ వేంద్రనగర్ కాలనీలోని జాన్సన్ గ్రామర్ స్కూల్‌కు వెళ్లే దారిలో రూ.54 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో పనులు ఆగిపోయాయన్నారు.